ఈనాడు కుమురం భీం

భావితరాలకు స్ఫూర్తిదాయకం

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : మహనీయుల చరిత్ర భావితరాలకు స్ఫూర్తిదాయకమని కలెక్టర్ వెంకటేష్ దోత్రే పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా బీసీ అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఎమ్మెల్సీ దండె విఠల్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, బీసీ సంఘాల నాయకులతో కలిసి మాట్లాడారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాలకు స్ఫూర్తిప్రదాతగా నిలిచారని గుర్తుచేశారు. జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాలకు ఆయన పేరు పెట్టేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించామన్నారు. ఆయన విగ్రహ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ, కుమురంభీం వంటి మహనీయులు ఈ ప్రాంతవాసులు కావడం గర్వంగా ఉందన్నారు. వాంకిడిలో బాపూజీ పేరిట స్మృతీవనం, విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. జిల్లా బీసీ అభివృద్ధి అధికారి సజీవన్, పద్మశాలీ సేవా సంఘం సభ్యులు రాజయ్య, ఆంజనేయులు, పీఏసీఎస్ ఛైర్మన్ అలీబిన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.


కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, చిత్రంలో ఎమ్మెల్సీ దండె విఠల్, అదనపు కలెక్టర్ దాసరి వేణు

ఈఎస్ఐతో సరి.. పీఎఫ్ ఏది మరి?

దారికి రాని ఏజెన్సీలు

ఈనాడు, ఆసిఫాబాద్:



ఏళ్ల తరబడి ఒప్పంద ఉద్యోగులకు వచ్చే లబ్ధిని పక్కదారి పట్టించిన ఏజెన్సీ నిర్వాహకులు గడిచిన కాలానికి సంబంధించి ఈఎస్ఐ నిధులు విడుదల చేసి చేతులు దులుపుకొన్నారు. ఈ ఉద్యోగులకు జరిగిన నష్టం గురించి 'ఈఎస్ఐ.. పీఎఫ్ డబ్బులు స్వాహా' శీర్షికన 'ఈనాడు'లో ఈ నెల 21న కథనం ప్రచురితమైంది. బాధితులు కలెక్టర్ వెంకటేష్ దోత్రే ముందు తమ గోడును వెళ్లబోసుకున్నారు. స్పందించిన పాలనాధికారి గుత్తేదారులతో మాట్లాడి ఈ డబ్బులు ఉద్యోగుల ఖాతాలో జమ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. సదరు ఏజెన్సీ నిర్వాహకులు రెండు రోజుల అనంతరం పంచాయతీ కార్యదర్శుల ఖాతాల్లో ఏప్రిల్ నుంచి ఆగస్టు నెలలకు సంబంధించిన ఈఎస్ఐ డబ్బులు మాత్రమే జమ చేశారు. వీటితో ఉపయోగం లేదని ఉద్యోగులు వాపోతున్నారు.

జిల్లావ్యాప్తంగా 15 ఏజెన్సీలు ఉండగా 750 మంది ఒప్పంద ఉద్యోగులు ఉన్నారు. ఇందులో 57 మంది పంచాయతీ కార్యదర్శులుగా పనిచేస్తున్నారు. వీరికి ప్రతి నెలా ఈఎస్ఐ రూ.552, పీఎఫ్ రూ.3,458 వీరి వేతనం నుంచి మినహాయించి మిగతా డబ్బులు ఇస్తున్నారు. 2022 ఆగస్టు నుంచి 2024 ఆగస్టు వరకు ఈఎస్ఐ కోసం కార్యదర్శుల నుంచి రూ.7,98,912, 2023 ఆగస్టు నుంచి 2024 ఆగస్టు వరకు పీఎఫ్ కోసం రూ.23,65,272 మొత్తం రూ.31,64,184 ఏజెన్సీకి సంబంధించిన వ్యక్తులు తీసుకున్నారు. ప్రస్తుతం అయిదు నెలలకు సంబంధించి ఈఎస్ఐ డబ్బులు మాత్రమే (రూ.1,57,320) ఖాతాలో వేశారు. అంటే రూ.30 లక్షలు వేతనాలకు సంబంధించి ఇంకా లెక్కలు లేవు.

ఎందుకు పునరుద్ధరిస్తున్నారు..

స్వయంగా కలెక్టరే ఆదేశించినా ఈఎస్ఐ, పీఎఫ్ డబ్బులను సంబంధిత ఉద్యోగుల ఖాతాల్లో వేయడానికి ఏజెన్సీలు మీనమేషాలు లెక్కిస్తున్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. చాలీచాలని వేతనంతో పనిచేస్తున్న ఉద్యోగులను మోసం చేస్తున్న ఏజెన్సీలపై విచారణ చేసి ఎందుకు రద్దు చేయడం లేదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ప్రతీ సంవత్సరం మళ్లీ వారినే పునరుద్ధరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

రూ.రెండు లక్షలు ఖర్చు అయ్యాయి

రవి, పంచాయతీ కార్యదర్శి(సిర్పూర్-టి)



మూడు నెలల క్రితం మా అమ్మకు పక్షవాతం వస్తే చంద్రపూర్ ఆసుపత్రికి తీసుకెళ్లాం. వారం రోజుల చికిత్సకు రూ.2 లక్షల వరకు ఖర్చు అయింది. అప్పులు చేసి ఆసుపత్రి బిల్లులు చెల్లించాం. ఈఎస్ఐ మాకు ఉంటే ఈ చికిత్స ఉచితంగా అయ్యేది. అధికారులు ఇప్పటికైనా సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలి.

పీఎఫ్ డబ్బులు ఏవి?



ప్రతి నెలా ముందుగా ఈఎస్ఐ డబ్బులు ఖాతాలో వేస్తే పంచాయతీ కార్యదర్శులకు, వారి కుటుంబ సభ్యులకు రూ.40 లక్షల వరకు ఆరోగ్య సేవలు ఆయా ఆసుపత్రుల్లో ఉచితంగా లభిస్తాయి. కొంత కాలంగా అనేక మంది ఉద్యోగులు ఆసుపత్రుల్లో చికిత్సల నిమిత్తం రూ.లక్షల్లో ఖర్చు పెట్టారు. ప్రస్తుత నెలకు సంబంధించినవి కాకుండా అంతకు ముందు నెలలకు ఈఎస్ఐ డబ్బులు ఇవ్వడంతో కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా పీఎఫ్ డబ్బులు జాడ లేదని అంటున్నారు.

యువతకు ఉపాధి.. పల్లెకు విస్తృతి

● మారుమూల ప్రాంతాలకు చేరిన ఈ-కామర్స్



✸ మంచిర్యాల జిల్లా తాండూరు మండలం అచ్చలాపూర్ గ్రామానికి చెందిన ఘనుకోట విశ్వేశ్వర్ తనకు అవసరమైన గృహోపకరణాన్ని ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేశారు. దాన్ని అతడి ఇంటి వద్దకు వెళ్లి ఈకామర్స్ సంస్థలో పనిచేస్తున్న యువకుడు జగదీశ్ అందజేశారు. మారుమూల గ్రామాల యువత, మహిళలు ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తూ తమకు నచ్చిన వస్తువులను తెప్పించుకుంటున్నారు.



✸ చెన్నూరు పట్టణానికి చెందిన అభిరామ్ డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కళాశాల అనంతరం, సెలవు దినాల్లో ఆయన ఓ సంస్థలో కొరియర్‌గా పనిచేస్తున్నాడు. స్థానికులు ఆన్‌లైన్ ద్వారా ఆర్డర్లు చేసినవి స్టాక్ పాయింట్ వద్దకు చేరుకోగా అక్కడి నుంచి వారి ఇళ్లకు వస్తువులను చేరవేస్తూ నెలకు రూ.12000 వరకు ఆదాయం పొందుతున్నాడు.

చెన్నూరు,న్యూస్‌టుడే:

ఉమ్మడి ఆదిలాబాద్ అనగానే అడవుల జిల్లా అని పేరు. కానీ ఇక్కడి మారుమూల పల్లెలకు సైతం ఆన్‌లైన్ వ్యాపారం విస్తరించింది. ఇంటి నుంచే ఆర్డర్ నమోదు చేయగానే తమకు నచ్చిన వస్తువు చేరుతుంది. దీని ద్వారా యువతకు ఉపాధి లభిస్తోంది. పల్లెలకు పాకిన ఈ-కామర్స్ సంస్థల విస్తృతిపై కథనం.



ఉమ్మడి జిల్లాలో నిత్యం ఆన్‌లైన్ వ్యాపారం తీరిలా..

- ఆర్డర్లు 2500
- సగటున కొనుగోళ్ల లావాదేవీలు రూ. 25 లక్షలు
- పండగ వేళల్లో రూ.50 లక్షలు
- ఆన్‌లైన్ కొరియర్ సంస్థలు 12
- ఉపాధి పొందుతున్న వారు 250

ఆన్‌లైన్‌లలో ఎక్కువగా కొనుగోలు చేస్తున్న వస్తువులివీ..

- ఆహార పదార్థాలు
- నిత్యావసరాలు
- ఎలక్ట్రానిక్ ఉపకరణాలు
- దుస్తులు, ఫ్యాషన్ సామగ్రి




వెలసిన ఏజెన్సీలు


జిల్లా కేంద్రాల్లో ప్రముఖ ఈ-కామర్స్ సంస్థలకు అనుబంధంగా కార్యాలయాలు, ఏజెన్సీలు, కొరియర్ సంస్థలు కొనసాగుతున్నాయి. 20 సంస్థలకు అనుబంధంగా శాఖల వారీగా సేవలు అందుతున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 30 రకాల ఆన్‌లైన్ సంస్థలు ఉన్నాయి. ప్రధాన పట్టణాలైన ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల తదితర పట్టణాల్లో ఈ సంస్థలు అందుబాటులో ఉన్నాయి. స్టాక్ పాయింట్ నుంచి వీటిని ఆర్డర్ చేసిన వారి ఇళ్లకు చేరవేస్తూ పలువురు నిరుద్యోగులు ఉపాధి పొందుతున్నారు.

పెన్ను, పుస్తకం మొదలు.. ల్యాప్‌టాప్‌ల వరకు ఇంట్లో అవసరమైన అన్ని వస్తువులు.. వ్యాపారాల నిర్వహణకు ఉపకరించే సామగ్రి.. గృహోపకరణ, వస్త్ర, యంత్ర, సాంకేతిక సామగ్రి కొనుగోలుకు వివిధ ఈ-కామర్స్ సంస్థలు వేదికలుగా నిలుస్తున్నాయి. ఆ సంస్థలకు అనుబంధంగా జిల్లా కేంద్రం, ప్రధాన పట్టణాల్లో కార్యాలయాలు, ఏజెన్సీలు, కొరియర్ సంస్థలు వెలిశాయి. వీటి ద్వారా గ్రామీణ ప్రాంతాలకు విస్తృతంగా సేవలు అందిస్తున్నాయి. దీంతో స్థానిక యువతకు ఉపాధి లభిస్తోంది. నిర్వాహకులు ద్విచక్ర వాహనాలు ఉన్న వారిని నియమించుకుంటున్నారు. నేరుగా వినియోగదారులకు అందిస్తున్నారు.

యువత, విద్యావంతులు, మహిళలు, వ్యాపారస్థులు, ఉద్యోగస్థులు ప్రస్తుతం ఈ-కొనుగోళ్ల విధానం వైపు మొగ్గుచూపుతున్నారు. అధిక శాతం ఇంట్లో ఉదయం నుంచి రాత్రి వరకు ఉపయోగపడే ప్రతి వస్తువు కొనుగోలు చేస్తున్నారు. నిత్యావసర సరకులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఇంట్లో గృహోపకరణాలకు అవసరమైనవన్నీ ఆర్డర్ చేసేస్తున్నారు.

ఆన్‌లైన్ కొనుగోళ్లపై జిల్లాలో 100 మంది యువతతో 'న్యూస్‌టుడే' నిర్వహించిన సర్వే వివరాలు ఇలా..





వాగు దాటితేనే అంగన్‌వాడీ సేవలు


మండలంలోని ఇర్కపల్లి అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో అవలిగూడెం ఉంది. ఇక్కడికి వెళ్లాలంటే మధ్యలో వాగు దాటాల్సి ఉంటుంది. వర్షాలకు తోడు చెలిమల ప్రాజెక్టు మత్తడి నుంచి వచ్చే నీటితో ఈ వాగు ఉప్పొంగి ప్రవహిస్తుంది. దీంతో ఆ గూడెంలోని గర్భిణులు, చిన్నారులకు గుడ్లు, పోషకాహారం అందించడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రవాహం ఎక్కువగా ఉంటే 15 రోజుల గుడ్లు, బియ్యం, పప్పులు, నూనె తదితర సామగ్రిని అంగన్‌వాడీ టీచరు బొమ్మన లక్ష్మి అతికష్టం మీద వెళ్లి పంపిణీ చేస్తున్నారు. 10 రోజులకోసారి బరువు తక్కువ ఉన్న పిల్లలకు తూకం వేసి అధికారులకు నివేదిక పంపుతున్నారు. అధికారులు స్పందించి వంతెన ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, తిర్యాణి


వాగు దాటుతూ వెళ్తున్న అంగన్‌వాడీ టీచరు

నష్టం తేల్చారు.. పరిహారం ఎప్పుడో?

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే :



కష్టమైనా.. నష్టం ఎదురైనా.. మరోసారి సాగు చేస్తే లాభం రాకపోతుందా అన్న ఆశతో కర్షకులు పంటలు పండిస్తుంటారు. ప్రకృతికన్నెర్ర చేసినా అధైర్యపడకుండా ముందుకు సాగుతారు. చేతిలో డబ్బు లేకున్నా.. అప్పు తెచ్చి అయినా ఏటా కాలంతో పోటీపడి పంటలు సాగు చేస్తుంటారు. ప్రస్తుత వానాకాలంలో జులై, సెప్టెంబరులో కురిసిన భారీ వర్షాలతో జిల్లాలో పలు మండలాల్లోని రైతుల పంటలు నష్టపోయాయి.

జిల్లాలో ప్రస్తుత వానాకాలంలో పత్తి, కంది, వరి, సోయా, జొన్న, మొక్కజొన్న.. ఇలా వివిధ రకాల పంటలు మొత్తం 4.23 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. జులై, సెప్టెంబరులో భారీ వర్షాలు కురిశాయి. ప్రాజెక్టుల గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలారు. మహారాష్ట్ర ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో ప్రాణహిత, పెన్‌గంగలు ఉప్పొంగాయి. దీంతో వీటి పరీవాహక ప్రాంతాల్లోని సిర్పూర్(టి), కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూరు, దహెగాం తదితర మండలాల్లో ఎక్కువ మొత్తంలో పంటలు నీట మునిగాయి. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంట నష్టం సర్వే చేశారు. ఎనిమిది మండలాల్లోని 59 గ్రామాల్లో వివిధ రకాల పంటలు 3,010 ఎకరాలు నష్టపోయినట్లు ప్రాథమిక అంచనా వేశారు. అనంతరం చేసిన తుది సర్వేలో పత్తి, వరి, మిరప పంటలు మొత్తం 2,692.11 ఎకరాల్లో నష్టం జరిగినట్లు నిర్ధారించి ప్రభుత్వానికి నివేదించారు. నష్టపరిహారం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో కర్షకుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. వాస్తవానికి అన్నదాతలు రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నా ప్రభుత్వం ఎకరాకు రూ.పది వేల వరకు ఇచ్చే అవకాశం ఉంది.

గతంలో నిలిచిపోగా..

గత యాసంగిలో ఎన్నడూ లేని విధంగా వరుణుడు కుండపోత కురిపించాడు. ఏప్రిల్‌లో అకాల వర్షాలతో జిల్లాలో పలు మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయి. మొత్తం 2,099 మంది కర్షకులు 2373.38 ఎకరాల్లో వరి, జొన్న, ఇతర పంటలు నష్టపోయినట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించారు. అప్పటి భారాస ప్రభుత్వం ఇందుకు రూ.2.37 కోట్లను జిల్లాకు మంజూరు చేసింది. రైతుల ఖాతాల్లో జమ చేసేలా అధికారులు ఖజానాకు పంపించారు. ఇక తమకు నష్టపరిహారం అందుతుందని అన్నదాతలు మురిసి పోయారు. అంతలో ఎన్నికల ప్రకటన వచ్చింది. నిధులు కాస్త నిలిచిపోయాయి. పాత నిధులపై కొత్త ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో అంతటితో ఆగింది.


ఇటీవల కురిసిన వర్షాలతో కౌటాల మండలం వీర్దండిలో నీట మునిగిన మిరప పంట

వివరాలు పంపించాం

శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి

జిల్లాలో వానాకాలంలో కురిసిన భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన వివరాలను ప్రభుత్వానికి నివేదించాం. మొత్తం 2,692 ఎకరాల్లో పంటలు నష్టపోయినట్లు గుర్తించాం. ప్రభుత్వమే పరిహారం నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసే అవకాశం ఉంది.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : జాతీయ స్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీలకు తెలంగాణ రాష్ట్ర జట్టు తరపున ఆడేందుకు ఆసిఫాబాద్‌లోని గిరిజన సంక్షేమ బాలికల ఆదర్శ క్రీడా పాఠశాల విద్యార్థినులు కె.నాగేశ్వరి, ఎస్.వైష్ణవి, కె.సరోజ, ఏ.శ్రీలత ఎంపికైనట్లు గిరిజన క్రీడల అధికారి బండ మీనారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంగు శుక్రవారం తెలిపారు. హైదరాబాద్‌లోని మౌలాలిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఖో ఖో పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని వివరించారు. ఈ నెల 28 నుంచి జార్ఖండ్‌లో నిర్వహించనున్న 34వ సబ్ జూనియర్ జాతీయస్థాయి ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.రమాదేవి, ఏసీఎంవో పి.ఉద్ధవ్, జీసీడీవోట శకుంతల, ఏటీడీవో చిరంజీవి ఈ క్రీడాకారులను, శిక్షకుడు తిరుమల్‌ను అభినందించారు.


ఎంపికైన క్రీడాకారిణులతో గిరిజన సంక్షేమ అధికారులు

సన్నాలే మిన్నంటూ..

● పెరిగిన వరి సాగుతో అన్నదాతకు గిట్టుబాటు

● ఉమ్మడి జిల్లాలో రూ.191.50 కోట్ల మేర ప్రయోజనం

నిర్మల్, న్యూస్‌టుడే:

ప్రస్తుత వానాకాలం నుంచే సన్నరకం వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో సన్నాలు సాగు చేస్తున్న రైతులకు గిట్టుబాటు ధర దక్కనుంది. సాగు ప్రారంభంలో సన్నాలకు బోనస్ ఇస్తామని ప్రభుత్వం చెప్పడంతో గతంతో పోలిస్తే ఈ సారి సాగు పెరిగింది. ఒక వేళ సన్నాలను వ్యాపారులు అంతకంటే ఎక్కువ ధరకే కొనుగోలు చేసే అవకాశం ఉండటంతో రెండు రకాలుగా రైతులకు మేలు జరగనుంది. దీంతోపాటు అర్హులైన తెల్లరేషన్ కార్డులున్న లబ్ధిదారులకు సన్న బియ్యం ఇస్తామని చెబుతుండటంతో అటు రైతులకు ఇటు సామాన్య ప్రజలకు ప్రయోజనం జరగనుంది.


లక్ష్మణచాంద మండలం నర్సాపూర్ సమీపంలో సాగులో ఉన్న సన్నరకం వరి

రైతులు పండించిన పంటకు మద్దతు అందించేందుకు ప్రభుత్వం వివిధ ఏజెన్సీల ద్వారా గతంలో దొడ్డు రకం ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. సన్నరకం ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో వ్యాపారులకే ధాన్యాన్ని అమ్ముకుంటున్నారు. దీంతో ప్రభుత్వం ప్రకటిస్తున్న కనీస మద్దతు ధరతో సంబంధం లేకుండా వ్యాపారులు సన్నాలను కొనుగోలు చేస్తుండటంతో మద్దతు అంతంతమాత్రంగా ఉంటోంది. ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో ఈ సారి సన్నాల సాగు అంచనాలను మించి పెరిగింది. ప్రభుత్వ సూచనల మేరకు 2021లో దొడ్డు రకాలను తగ్గించి సన్నాలతోపాటు మొక్కజొన్న, పప్పు దినుసులను అధికంగా సాగు చేశారు. సాగు విస్తీర్ణం పెరగడంతోపాటు దిగుబడి బాగా వచ్చింది. అయితే సన్నాలను కొనేవారు లేకపోవడం, ప్రభుత్వం దొడ్డు రకాలను మాత్రమే కొనుగోలు చేయడంతో సన్నరకం రైతులు ధాన్యం అమ్ముకునేందుకు ఇబ్బందులు పడ్డారు. ఈ సారి సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తుండటంతో గిట్టుబాటు దక్కనుంది. ప్రస్తుతం ప్రభుత్వ మద్దతు ధర 'ఏ' రకానికి రూ.2,320 'బి' రకానికి రూ.2,300 ధర ఉంది. దీంతోపాటు రూ.500 బోనస్ కలిపితే 'ఏ' రకానికి రూ.2,820, 'బి' రకానికి రూ.2,800 దక్కనుంది.

ఉమ్మడి జిల్లాలో 3.48 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నారు. ఇందులో సన్నరకాలు 1,91,500 ఎకరాల్లో పండిస్తుండగా.. మిగతా 1,56,500 ఎకరాల్లో దొడ్డురకం సాగు చేస్తున్నారు. సన్నరకం ధాన్యం ఎకరానికి 20 క్వింటాళ్ల చొప్పున ఉమ్మడి జిల్లాలో 38.30 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ప్రభుత్వం సన్నరకాల ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తుండటంతో ఉమ్మడి జిల్లాలో సన్నరకాలు పండించిన అన్నదాతలకు అదనంగా రూ.191.50 కోట్ల మేర మేలు జరగనుంది. ఉమ్మడి జిల్లాలో సన్న, దొడ్డురకాల ధాన్యం కొనుగోలుకు 608 కేంద్రాలు ఏర్పాటు చేస్తోంది. ఒక కేంద్రంలో సన్న, దొడ్డురకం ధాన్యం కొనుగోలు చేసేందుకు వేర్వేరు కాంటాలు సిద్ధం చేస్తున్నారు.

రేషన్ లబ్ధిదారులకు ప్రయోజనం

ప్రస్తుతం ఉన్న తెల్లరేషన్ కార్డుదారులతో పాటు కొత్తగా పొందే రేషన్‌కార్డు లబ్ధిదారులకు వచ్చే ఏడాది జనవరి నుంచి సన్న బియ్యం ఇస్తామని రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించడంతో ఆశలు చిగురిస్తున్నాయి. దీనివల్ల కార్డుదారులకు ప్రయోజనం చేకూరనుంది. ఇప్పటి వరకు దొడ్డు బియ్యమే ఇస్తుండగా వీటిని చాలా మంది తినకుండా అమ్ముకుంటున్నారు. బయట సన్నాలను కిలో రూ.50 వరకు కొనుగోలు చేయడంతో ఆర్థికంగా ఇబ్బందిగా మారింది. ఇది అమలైతే పేదలకు తక్కువ ధరకు సన్నబియ్యం అందనున్నాయి.

ఉమ్మడి జిల్లాలో వానాకాలం సాగు వివరాలు (ఎకరాల్లో)

● జిల్లా ● సన్నరకం ● దొడ్డురకం ● మొత్తం

జిల్లా	సన్నరకం	దొడ్డురకం	మొత్తం
నిర్మల్	70,000	60,000	1,30,000
మంచిర్యాల	90,000	70,000	1,60,000
ఆదిలాబాద్	1,500	500	2,000
కుమురంభీం	30,000	26,000	56,000

డీఈవోగా యాదయ్య బాధ్యతల స్వీకరణ

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : జిల్లా విద్యాశాఖాధికారి(పూర్తి అదనపు బాధ్యతలు)గా ఎస్.యాదయ్య శుక్రవారం ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ డీఈవోగా పని చేసిన అశోక్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానంలో మంచిర్యాల జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.యాదయ్యకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. కార్యాలయ సిబ్బంది, కోఆర్డినేటర్లు యాదయ్యను సత్కరించి స్వాగతం పలికారు. ఏసీజీఈ ఉదయ్‌బాబు, ఎఫ్ఏవో దేవాజీ, కోఆర్డినేటర్లు శ్రీనివాస్, మధుకర్, ఆబిద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

తలసీమియా బాధితులకు వరం

- దేశీయంగా 'ఇన్‌ఫ్యూజ్ థల పంపు' అందుబాటులోకి..
- ప్రభుత్వం ఆరోగ్యశ్రీలో ఉచితంగా అందిస్తే ప్రయోజనం

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వైద్య విభాగం : కొత్తగా అందుబాటులోకి వచ్చిన 'థల పంపు' సికిల్‌సెల్, తలసీమియా బాధితుల కెంతో ఉపయోగకరంగా మారనుంది. రక్తహీనతకు గురై తరచూ రక్తం ఎక్కించుకునే బాధితుల శరీరంలో అవసరానికి మించి పేరుకుపోయే ఐరన్‌ను తగ్గించటానికి ఇచ్చే సూది మందును వేయించుకోవటానికి ఇది ఎంతగానో ఉపయుక్తంగా ఉంది. ఈ సూది మందును బాధితులకు సెలైన్‌లో కలిపి ఇస్తుంటారు. ఇలా ఇచ్చేటప్పుడు వారు పడకపై కనీసం 8 గంటల వరకు పడుకోవాల్సి వస్తుంది. కానీ థలపంపు ద్వారా ఆ ఇంజెక్షన్ తీసుకుంటే గంటల తరబడి పడకపై ఉండాల్సిన అవసరం లేకుండా ఉంటుంది. పంపు బెల్ట్‌ను శరీరంపై అమర్చుకొని సాధారణ పనులు చేసుకోవచ్చు. నిర్ణీత సమయం పాటు ఆ సూది మందు చర్మంలోకి చేరిపోతుంటుంది.


బాధితులకు థల పంపును పంపిణీ చేస్తున్న ఎంపీ నగేష్


ఇలా ఇన్‌ఫ్యూజ్ పంపును ఏర్పాటు చేసుకొని సూది మందు తీసుకోవచ్చు

ఉమ్మడి జిల్లాలో బాధితులు ఇలా..
తలసీమియా : 2021
సికిల్‌సెల్: 565

ఇన్‌ఫ్యూజ్ థల పంపు ప్రస్తుతం ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. దీని విలువ ఆయా కంపెనీలను బట్టి రూ.60 వేల నుంచి రూ.లక్ష వరకు ఉంటుంది. నిరుపేద బాధితులు దాన్ని కొనుగోలు చేసే ఆర్థిక స్తోమత కలిగి ఉండరు. అయితే కేంద్ర ప్రభుత్వం ఆత్మ నిర్భర్ భారత్‌లో భాగంగా 'మేడ్ ఇన్ ఇండియా ఫర్ ది వరల్డ్' కింద వైద్య పరికరాలు, ఔషధాల తయారీని ప్రోత్సహిస్తోంది. చెన్నైలోని వి టైటాన్ కార్పొరేషన్ ఇన్‌ఫ్యూజ్ థల పంపును దేశీయంగా తయారు చేసి అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇటీవల తలసీమియా రాష్ట్ర సొసైటీకి ప్రయోగాత్మకంగా పది థల పంపులను ఆ కంపెనీ అందజేసింది. ఆదిలాబాద్ జిల్లాలో మొదటి సారి ముగ్గురు బాధితులకు ఆ కంపెనీ ప్రతినిధులు వాటిని ఎంపీ గోడం నగేష్ చేతుల మీదుగా అందించారు.

చాలా సులువు..

ఇన్‌ఫ్యూజ్ పంపు ద్వారా సూది మందు వేసుకోవటం చాలా సులువుగా ఉంటుంది. సూది మందును పంపులో లోడ్ చేసి శరీరంపై ఎక్కడ దాన్ని తీసుకోవాలో అక్కడ ఆ పంపును బెల్ట్ ద్వారా బిగించేస్తే సరి. దానిలో ఏర్పాటు చేసిన సూది ద్వారా చర్మంలోకి నిర్ణీత మోతాదులో ఆ మందు వెళ్లిపోతుంటుంది. ఈ సమయంలో బాధితులు సాధారణ పనులన్నీ చేసుకోవచ్చు.

విధిగా సూది మందు..

తలసీమియా, సికిల్‌సెల్ బాధితులు తరచూ రక్తం ఎక్కించుకోవటం వల్ల వారి శరీరంలో అత్యధికంగా ఐరన్ పేరుకుపోతుంది. శరీరంలోని అవయవాలు వ్యాధులకు గురై మృతి చెందే ప్రమాదం ఉంటుంది. బాధితుల శరీరంలో పేరుకుపోయిన ఐరన్‌ను తొలగించటానికి సూది మందు వేయించుకోవటం అత్యవసరం. ప్రత్యామ్నాయంగా మాత్రలు ఉన్నా వాటితో ఆశించిన ఫలితాలు ఉండవంటున్నారు.

ప్రభుత్వం దృష్టి పెడితే మేలు..

సికిల్‌సెల్, తలసీమియా వ్యాధులు ఆరోగ్యశ్రీ పథకంలో ఉన్నాయి. ఇన్‌ఫ్యూజ్ పంపు, సూది మందులు మాత్రం అందులో లేవు. దేశీయంగా తయారు చేసిన థల పంపు కొనుగోలు చేయాలంటే రూ.20 వేలు భరించే ఆర్థిక స్తోమత పేద రోగులకు ఉండదు. సూది మందు సైతం బయట మార్కెట్‌లో రూ.200 ఉంటుంది. వీటిని ఆరోగ్యశ్రీలో చేర్చి ప్రభుత్వం ఉచితంగా అందజేస్తే మేలు చేసిన వారవుతారని బాధితులు కోరుతున్నారు.

పాఠశాల అభివృద్ధి పనులకు సాయం

తాండూరు మండలం అచ్చలాపూర్ గ్రామానికి చెందిన పాపయ్య, సుభద్ర దంపతుల మొదటి కుమారుడు చిల్లప్ప విజయ్‌కుమార్. చిన్నప్పుడే తల్లిదండ్రులు చనిపోవడంతో మేనమామ, మేనత్తలు మహావాది లక్ష్మీకాంతయ్య, సీతమ్మలు అతడిని దత్తత తీసుకొని పెంచుకున్నారు. అచ్చలాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో 1వ తరగతి, అనంతరం 3 సంవత్సరాలు వేద విద్యను పూర్తి చేశాడు. మంథనికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి వరకు పూర్తి చేశాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ చదువుకున్నాడు. కొలువు సాధించి సెంట్రల్ వాటర్ కమిషన్ డైరెక్టర్ హోదాలో ఉద్యోగ విరమణ పొందారు. ఆయన భార్య శీల గుండెపోటుతో మృతి చెందడంతో ఆమె పేరిట స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అచ్చలాపూర్ ప్రభుత్వ పాఠశాలలో రూ.19 లక్షలతో అభివృద్ధి పనులు చేయించారు. పాఠశాలకు 10 గుంటల క్రీడా స్థలం కొనుగోలు చేసి చుట్టూ ప్రహరీ, గేటు ఏర్పాటు చేయించారు. పాఠశాలలో కార్యక్రమాల నిర్వహణకు ఓ వేదిక నిర్మించారు. తరగతి గదుల పైకప్పు శిథిలావస్థకు చేరడంతో ఇనుప రేకులు వేయించి మరమ్మతులు చేయించారు. బాలికల శౌచాలయాల మరమ్మతులకు రూ.80 వేలు, ల్యాప్‌టాప్, ప్రింటర్‌కు రూ.50 వేలు, ఇతరత్రా మరమ్మతులకు రూ.50 వేలు, సైన్స్ పరికరాలు, క్రీడా సామగ్రికి రూ.50 వేలు వివిధ సందర్భాల్లో ఇచ్చారు.


చిల్లప్ప విజయ్‌కుమార్, కేంద్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగి


పాఠశాలలో ఏర్పాటు చేసిన గేటు


అచ్చలాపూర్ పాఠశాలకు ఇచ్చిన ఆట స్థలం

సామాజిక తోవ.. చదువుకున్న బడికి సేవ

తాండూరు, న్యూస్‌టుడే:

పుట్టి పెరిగిన ఊరు.. చదువుకున్న బడిని గుర్తుంచుకోవడమే కాదు వీటిని అభివృద్ధి చేయాలి అనుకునే వారు కూడా ఉంటారనేది ఈ పూర్వ విద్యార్థులను చూస్తే అర్థమవుతోంది. వారు చదువుకున్న రోజుల్లో వసతులు లేక పడిన కష్టాలను తమ ఊరి విద్యార్థులు పడకూడదనుకున్నారు. పుట్టి పెరిగిన ఊరి బాగు కోసం.. చిన్ననాడు చదువుకున్న ప్రభుత్వ పాఠశాలలో వసతులు కల్పించారీ దాతలు.

ఆటల కోసం స్థలం కొనుగోలు

కన్నెపల్లి మండలం జన్కాపూర్ గ్రామానికి చెందిన మాధవరపు సంతోష్‌రావు చిన్నతనంలో స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉన్నత స్థాయిలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గ్రామంలో రూ.12 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. జన్కాపూర్ ప్రభుత్వ పాఠశాలకు ఆట స్థలం కోసం 20 గుంటల స్థలాన్ని కొనుగోలు చేసి చుట్టూ ప్రహరీని నిర్మించి గేటు ఏర్పాటు చేయించారు. విద్యార్థులకు ఆట వస్తువులు అందించారు. శుద్ధ జల ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. 6 కంప్యూటర్లు అందజేశారు.


జన్కాపూర్ పాఠశాలకు కొనిచ్చి ప్రహరీ ఏర్పాటు చేయించిన ఆట స్థలం


జన్కాపూర్ పాఠశాలలో విద్యార్థులకు అందించిన కంప్యూటర్లు

నిరుద్యోగుల పక్షాన పోరాడతా

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే: రానున్న రోజుల్లో జరిగే ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పోటీల్లో తాను ఈసారి బరిలో నిలువనున్నట్లు అల్ఫోర్స్ విద్యా సంస్థల ఛైర్మన్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 30 సంవత్సరాలుగా విద్యారంగంలో సేవలందిస్తూ విద్యావేత్తగా అనుభవం ఉన్న తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే నిరుద్యోగులకు అండగా ఉంటానన్నారు. నిరుద్యోగుల పక్షాన పోరాడేందుకు బలం పెంచే విధంగా ఈ సారి వంద శాతం ఓటు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అర్హులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశాన్ని కోల్పోవద్దని, పట్టభద్రుల్లో చైతన్యం పెంచే లక్ష్యంతో గత 15 రోజుల నుంచి తమ ప్రతినిధులతో ఓటు నమోదు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రధాన పార్టీనుంచి టికెట్ ఆశిస్తున్నానన్నారు. టికెట్ వస్తే పార్టీ తరపున పోటీ చేస్తానని, లేదంటే స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటానని స్పష్టం చేశారు. ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల ఛైర్మన్ వి.నరేందర్‌రెడ్డి

తొలిరోజు 30 మంది హాజరు



పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : డీఎస్సీ-2008లో ఎంపికైన బీఎడ్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన శుక్రవారం ఆదిలాబాద్‌లోని విద్యాశాఖ కార్యాలయంలో ప్రారంభమైంది. తొలిరోజున మంచిర్యాల, నిర్మల్, కుమురం భీం, ఆదిలాబాద్ జిల్లాల నుంచి 30 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అక్టోబరు 5వ తేదీ వరకు పరిశీలన కొనసాగుతుందని డీఈవో ప్రణీత తెలిపారు. కమిటీ సభ్యులు సుకుమార్, మహేందర్‌రెడ్డి అభ్యర్థులు పూరించిన పత్రాలతో పాటు ఆయా ధ్రువపత్రాలను పరిశీలించారు.

ఆలయాల సంరక్షణకు ప్రత్యేక చట్టాలు తేవాలి

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: హిందూ ఆలయాల సంరక్షణ కోసం తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని గన్నవరం భువనేశ్వర మఠం పీఠాధిపతి కమలానంద భారతి స్వామి కోరారు. జిల్లాకేంద్రానికి వచ్చిన ఆయన స్థానిక నటరాజ్‌నగర్‌లోని ఉమామహేశ్వర ఆలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో తిరుమలలో లడ్డూప్రసాద తయారీలో జరిగిన కల్తీ విషయం ప్రస్తుత హిందూ సమాజాన్ని గాయపర్చిందన్నారు. ఈ నేపథ్యంలో మాజీ సీఎం జగన్ తిరుపతి పర్యటనపై అభ్యంతరం వ్యక్తంచేశారు. వ్యక్తిగతంగా క్రైస్తవ మత సిద్ధాంతం ఆచరించే ఆయన నిజాయతీగా వ్యవహరించాలని పేర్కొన్నారు. రాజకీయ లబ్ధి కోసం ఆచార వ్యవహారాలను దెబ్బతీసే ప్రయత్నం చేయొద్దని, ఓట్ల కోసం హిందువుల్లాగా నటించొద్దని హితవు పలికారు. ఎవరి మతాచారాలు వారివేనని, ఎవరికివారు స్వేచ్ఛగా ఆచరించుకోవచ్చని, అదే సమయంలో అన్నింటినీ గౌరవించాలన్నారు. హిందూ ఆలయాలకు అన్యమతస్థులు రావాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఒకవేళ వెళితే అక్కడి దైవాన్ని నమ్ముతున్నామనే అంగీకారం తెలపాలని సూచించారు. రాజకీయ నాయకత్వం నచ్చితే నాయకులు ఏ మతం వారైనా ఓట్లు వేస్తారని, కేవలం స్వార్థ ప్రయోజనాల కోసం తమ చేతల ద్వారా మతవైషమ్యాలు తీసుకురావొద్దని చెప్పారు. సమావేశంలో విభాగ్ ధర్మాచార్య సంపర్క ప్రముఖ్ పతికె రాజేందర్, వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి మూర్తి ప్రభాకర్, మాతృశక్తి ప్రాంత సహ సంయోజిక సద్ది శ్రీవాణి, జిల్లా సహ సంయోజిక సిరి, నాయకులు చింతకుంట శ్రీనివాస్, పతికె రమేశ్, అయ్యన్నగారి భూమయ్య, భీమేశ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమలానందభారతి స్వామి

ముథోల్(బాసర): బాసర అమ్మవారిని శుక్రవారం కమలానందస్వామి దర్శించుకొన్నారు. వేదపండితులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో కుంకుమపూజ, మహాహారతి, తదితర పూజలను నిర్వహించారు. భాజపా నాయకులు సతీశ్వర్‌రావు, సుభాష్‌యాదవ్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.


వేదికపై రాజయ్య ప్రసంగాన్ని అడ్డుకుంటున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్

రాజయ్య ప్రసంగాన్ని అడ్డుకున్న భారాస ఎమ్మెల్యే

బోథ్, న్యూస్‌టుడే : బోథ్‌లో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి శుక్రవారం రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగాన్ని భారాస ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ అడ్డుకోవడం ఉద్రిక్తతకు దారి తీసింది. రాజయ్య మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీతో తనకున్న జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ఇవ్వకపోయి ఉంటే ప్రజలు ఎవరిని తిట్టుకునేవారని? ఇస్తే ఎవరికి లాభం జరగాలి? కానీ ఎవరికి లాభం జరిగింది.. ఎవరు పదవులను అనుభవిస్తున్నారని ప్రశ్నించారు. బాపూజీ అంత్యక్రియలు ఆయన సొంత స్థలం జలసౌదలో నిర్వహించాలని నేను పట్టుబట్టానన్నారు. కొందరు నన్ను భయపెట్టారని అన్నారు. భారాస ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆగ్రహంతో ఆయన ప్రసంగాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసులు అనిల్ జాదవ్‌ను ఆపారు. రాజయ్య ప్రసంగాన్ని ముగించే వరకు సమావేశంలో నిరసన వ్యక్తం చేస్తూ అలాగే నిలబడి ఉన్నారు. ఇలాంటి మాటలు మాట్లాడాల్సిన సమయం కాదని, సమావేశంలో ఎలా మాట్లాడాలో తెలుసుకోవాలని అనిల్ జాదవ్ మండిపడ్డారు. నేను భారాస గురించి మాట్లాడటం లేదని రాజయ్య జవాబిచ్చారు. రాజయ్య తన ప్రసంగాన్ని ఆపకపోవటంతో పలువురు పద్మశాలీ సంఘం నాయకులు కల్పించుకొని సమావేశాన్ని ఆపించారు.

విద్యుత్తు శాఖలో బదిలీల విధివిధానాలు విడుదల

మంచిర్యాల సిటీ: ఎట్టకేలకు ఎన్పీడీసీఎల్ పరిధిలోని అన్ని విభాగాల బదిలీలకు రంగం సిద్ధమైంది. విధివిధానాలతో కూడిన ఉత్తర్వులు సైతం జారీ అయ్యాయి. జూన్ 30వరకు ఒకేచోట రెండేళ్లు పూర్తిచేసుకున్న వారందరూ బదిలీకి అర్హులే అని అందులో పేర్కొన్నారు. వచ్చేనెల ఏడో తేదీ వరకు ఈ ప్రక్రియ పూర్తి కానుంది. జిల్లాలో పాతుకుపోయిన సిబ్బంది, సంఘాల నాయకులు, వారి అనుచరులకు తప్పితే మిగతా వారికి ఉపయోగం అంతంత మాత్రమే అని సంస్థలోని ఉద్యోగుల నుంచే విమర్శలు వస్తున్నాయి. శనివారం సాయంత్రం వరకు బదిలీకి అర్హత ఉన్నవారి వివరాలు అందించాలని ఆదేశాలు రావడంతో ఎస్ఈ కార్యాలయ సిబ్బంది అందులో నిమగ్నమయ్యారు.

ఉమ్మడి జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే: రెబ్బెన మండలం గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం ఉమ్మడి జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అండర్-19 బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. బెల్లంపల్లి ఏరియా ఎస్‌ఓటు జీఎం రాజమల్లు క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలు ప్రారంభించారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 4 నుంచి 6వ తేదీ వరకు కామారెడ్డి జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి తెలిపారు. బాలుర విభాగంలో పి.సాయిచరణ్, సీహెచ్.గోపాలశ్రీ కృష్ణ, డి.ప్రేమ్‌దీప్, డి.సిద్ధార్థ, సీహెచ్.నిఖిల్, కె.అక్షిత్, ఏ.అఖిల్, టి.రుద్రధ్రువ, నందం, ఆర్.అక్షయ్, కోచ్‌లుగా కుందారపు నరేష్, మేనజర్‌గా మల్లేష్ వ్యవహరించనున్నట్లు తెలిపారు. బాలికల విభాగంలో టి.ప్రజ్వల, ఎస్.సాయి శ్రీవర్శిణి, ఎం.సహస్ర, స్ఫూర్తికారుణ్య, డి.వేరొనిక, డి.నవ్య, టి.జాన్సీ, సీహెచ్. లక్ష్మి ఎంపికైనట్లు తెలిపారు. కోచ్‌గా జి.గోపాల్, మేనేజర్‌గా కె.భాస్కర్ వ్యవరించనున్నట్లు పేర్కొన్నారు. వీరికి శనివారం నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు గోలేటిలోని సింగరేణి పాఠశాల మైదానంలో కోచింగ్ క్యాంపు ఉంటుందని చెప్పారు. రాష్ట్ర బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ జాయింట్ కార్యదర్శి తిరుపతి, ఖైరిగూడ ప్రాజెక్టు అధికారి నరేందర్, బెల్లంపల్లి ఏరియా పర్సనల్ అధికారి రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్ పాల్గొన్నారు.


ఎంపికైన క్రీడాకారులతో బెల్లంపల్లి ఏరియా ఎస్‌ఓటు జీఎం రాజమల్లు, కమిటీ సభ్యులు

శభాష్.. శివ!

- యూట్యూబర్‌గా రాణిస్తున్న పల్లెటూరి కుర్రాడు

తెలుగు మాధ్యమంలో చదివిన ఆ పల్లెటూరి కుర్రాడు బీటెక్‌లో చేరగానే ఆంగ్లంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రాజెక్టు వర్క్‌లు, ప్రజెంటేషన్లు ఇచ్చే సమయంలో ఆ భాషలో మాట్లాడేందుకు తన లాగే చాలా మంది బాధపడుతున్నారని గుర్తించారు. దీన్ని అధిగమించేందుకు సులువైన మార్గాలను అన్వేషించారు. యానిమేషన్ ద్వారా చెబితే అర్థం చేసుకోవచ్చని భావించి యూట్యూబ్ ద్వారా మూడు భాషల్లో వీడియోలు రూపొందించి ఆంగ్ల పాఠాలు బోధిస్తూ యూట్యూబర్‌గా రాణిస్తున్నారు. -న్యూస్‌టుడే, భైంసా గ్రామీణం




సాధించిన గోల్డెన్ ప్లే బటన్‌తో.. శివ

నిర్మల్ జిల్లా భైంసా మండలం లింగా-1 గ్రామానికి చెందిన గాడేకర్ శివ.. ప్రాథమిక, మాధ్యమిక విద్యాభ్యాసమంతా తెలుగు మాధ్యమంలోనే పూర్తిచేశారు. ఇంజినీరింగ్(సివిల్) ఆంగ్ల మాధ్యమం కావడంతో చేరినప్పటి నుంచి ఇబ్బందులు పడ్డారు. ప్రధానంగా ప్రాజెక్టు వర్కులు, ప్రజెంటేషన్లు ఇచ్చే క్రమంలో. ఆంగ్ల భాషను ఎక్కడ, ఎలా నేర్చుకోవాలో తెలియని అయోమయ స్థితి ఎదురైంది. తెలుగు మాధ్యమంలో చదివిన వారికి తనలాగే సమస్య ఉందని గుర్తించి ఎలాగైనా దీన్ని గట్టెక్కాలని నిర్ణయించుకున్నారు.


గాడేకర్ శివను అభినందిస్తున్న భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్



శివ యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసిన మూడు భాషల వ్యాఖ్యలు

పది లక్షలకు పైగా వీక్షకులు

గూగుల్, యూట్యూబ్‌లను అనుకూలంగా మార్చుకుని మొదట ఆయన ఆంగ్లంపై పట్టు సంపాదించారు. దీని కోసం రాత్రింబవళ్లు కష్టపడ్డారు. యానిమేషన్ (బొమ్మలతో)లో చెబితే చక్కగా అర్థం చేసుకోవచ్చని నిర్ణయానికి వచ్చారు. తెలుగు, హిందీ, ఆంగ్లం, ఉర్దూ మాధ్యమాల్లో యానిమేషన్‌లో పాఠాలు రూపొందించి యూట్యూబ్ ఛానల్ 'గాడేకర్ శివ' ద్వారా వీడియోలు పొందుపర్చారు. ఇలా అయిదేళ్లలో 259 వీడియోలు అప్‌లోడ్ చేయగా.. 10,14,000 మంది సబ్‌స్క్రైబర్లుగా (వీక్షకులు) చేరారు. ఈ వీడియోలను 5,84,49,000 మందికి పైగా వీక్షించారు. శివ ప్రతిభను గుర్తించిన యూట్యూబ్ ఇటీవల గోల్డెన్ ప్లేబటన్ (బంగారు పలక) పంపించింది.

అరబ్ దేశాల నుంచి ఆదరణ

స్పోకెన్ ఇంగ్లిష్, భాషా నైపుణ్యంపై పాఠాలను కొత్తగా రూపొందిస్తున్నారు. సందర్భానుసారంగా ఆంగ్ల పదాలు, వ్యాఖ్యలు, యానిమేషన్ చిత్రాలతో రూపొందించిన వీడియోలు చక్కటి ఆదరణ పొందుతున్నాయి. వీడియోలకు తానే వ్యాఖ్యానం ఇస్తున్నారు. మొదట తెలుగు, హిందీ, భాషల్లో వీడియోలు చేశారు. అరబ్ దేశాల్లోని వీక్షకులు ఉర్దూలో కావాలని కోరడంతో.. హిందీలో వారికి పంపి ఉర్దూలో తర్జుమా చేయించారు. అలా ఉర్దూలోనూ వీడియోలు అప్‌లోడ్ చేస్తున్నారు. తన వీడియోల ద్వారా కోటి మంది వీక్షకులను చేర్పించి డైమండ్ ప్లే బటన్ సాధించడమే తన లక్ష్యమని శివ చెబుతున్నారు.

వెలుగులోకి పురాతన భైరవ విగ్రహం

కుంటాల, న్యూస్‌టుడే: నిర్మల్ జిల్లా కుంటాలలోని ప్రాచీన గ్రామదేవత గజ్జలమ్మ ఆలయానికి తూర్పున సుమారు వంద మీటర్ల దూరంలో క్రీస్తు శకం 6వ శతాబ్దానికి చెందిన రాష్ట్రకూట రాజు చెక్కిన భైరవుని విగ్రహాన్ని శుక్రవారం గుర్తించినట్లు ప్రముఖ కవి, చరిత్ర పరిశోధకుడు తుమ్మల దేవరావ్ తెలిపారు. రాష్ట్రకూటుల కాలంలో ఈ గ్రామం వైభవంగా వెలిగినట్లు ఇక్కడ వెలుగులోకి వచ్చిన విగ్రహాలతో తెలుస్తోంది. భైరవ సంప్రదాయం ఇక్కడ కొనసాగినట్లు ఇక్కడ శిల్పసంపద తేటతెల్లం చేస్తోంది. నిర్మల్ జిల్లా ప్రాంతం రాష్ట్రకూట రాజు 2వ కృష్ణుని ఏలుబడిలో ఉన్నట్లు దిలావర్‌పూర్‌లో వెలుగులోకి వచ్చిన శాసనం వల్ల తెలుస్తోంది. వెలుగులోకి వచ్చిన భైరవ విగ్రహంలో పెద్ద దమ్మిల్లా జటఝూటం, పెద్ద కుండలాలు, కర్ణాభరణాలు, మెడలో హారంతోపాటు కాపాలజంధ్యం, నిజహస్తాల్లో కత్తి, రక్తంతో కూడిన పాత్ర, పరిహస్తాల్లో దండకం డమరుకం ఉన్నాయి. దండకడియాలు, ముంజేతి కంకణాలు, మొలతాడు కలిగి త్రిభంగిమలో వైతస్తిక పాదభంగిమలో ఉన్నాడు. కాళ్లకింద సర్పవాహనం ఉండే అవకాశం ఉంది. కానీ భూమిలో కుంగిపోయి ఉన్నందున వాటిని గుర్తించలేకపోయామని దేవరావ్ వివరించారు. విగ్రహ లక్షణాలు బట్టిచూస్తే అష్ట భైరవుల్లో కాల భైరవునిగా చెప్పొచ్చు. ఇదే కాకుండా 16వ శతాబ్దపు మరో విగ్రహం ఈ ప్రాంతంలో గుర్తించామని, ఆ భైరవుని లక్షణాలు కూడా రాష్ట్రకూట భైరవుని విగ్రహం పోలి ఉన్నాయని పేర్కొన్నారు. క్షేత్ర పర్యటనలో చరిత్ర పరిశోధకులు అబ్బిడి రాజేశ్వర్‌రెడ్డి, తుమ్మల సుజాత పాల్గొన్నారు.


కుంటాలలో భైరవ విగ్రహం చూపుతున్న దేవరావు

పకడ్బందీగా వన్యప్రాణుల సంరక్షణ నిబంధనల అమలు

ఏసీసీ, న్యూస్‌టుడే: కవ్వాల్ అభయారణ్యం పరిధిలో వన్యప్రాణుల సంరక్షణ, అటవీ నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అభయారణ్యం పరిధిలో నిబంధనల అమలుపై దండేపల్లి, జన్నారం మండలాల అధికారులతో చర్చించారు. అక్రమ వ్యాపారాలు, నిర్మాణాలు జరగకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలన్నారు. పర్యావరణ చట్టం, సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు అభయారణ్యం చుట్టూ కిలోమీటరు మేర ఏకో సెన్సిటివ్ జోన్, 10 కిలోమీటర్ల మేర రేడియస్ జోన్‌లను ఏర్పాటుచేయాలన్నారు. ప్రత్యేక మానిటరింగ్ కమిటీని ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. జిల్లా అటవీ అధికారి శివ్‌ఆశిష్‌సింగ్, అదనపు కలెక్టర్ మోతీలాల్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
ఆసిఫాబాద్ : 80085 73640
కాగజ్‌నగర్ : 80085 73635
జైనూరు : 63045 83192
రెబ్బెన : 80085 73643

న్యూస్‌టుడే, కాగజ్‌నగర్ గ్రామీణం

? కోసినిలో పారిశుద్ధ్యం లోపించింది. ఎక్కడా చెత్త తీసుకెళ్లడం లేదు. - తిరుపతి గౌడ్, కోసిని

✓ పారిశుద్ధ్య సిబ్బందితో చెత్త తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. - రమేష్, ఎంపీడీఓ, కాగజ్‌నగర్

నేర వార్తలు

పురుగుమందు తాగి ఒకరి ఆత్మహత్య


హివిరె నాందేవ్

వాంకిడి, న్యూస్‌టుడే: మండల కేంద్రానికి చెందిన హివిరె నాందేవ్(54) శుక్రవారం సాయంత్రం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. నాందేవ్ ఏడాదికాలంగా పక్షవాతంతో బాధపడుతున్నారు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు గమనించి ఆసుపత్రికి తీసుకువెళ్లే క్రమంలో మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలికపై అత్యాచారం

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి అత్యాచారానికి పాల్పడినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం పాఠశాల అనంతరం విద్యార్థిని ఇంటికి వెళ్లారు. సదరు విద్యార్థిని బయటకువెళ్లడానికి సిద్ధమవుతుండగా అక్కడే మద్యం మత్తులో ఉన్నవ్యక్తి బాలికను సమీపంలోని తన ఇంటికి బలవంతంగా తీసుకెళ్లాడు. తలుపులు వేసి లోపల అఘాయిత్యానికి పాల్పడ్డాడు. గమనించిన ఇద్దరువ్యక్తులు వెంటనే పోలీసులకుసమాచారం ఇచ్చారు. వారు వచ్చి నిందితుడిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బాలికకు వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్లారు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జూద స్థావరంపై పోలీసుల దాడులు

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని టీఆర్‌నగర్‌లో జూదం ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు శుక్రవారం తనిఖీ చేసినట్లు సీఐ సతీష్ పేర్కొన్నారు. ఓ ఇంటి పరిసర ప్రాంతంలో ఏడుగురు వ్యక్తులు జూదం ఆడుతూ పట్టుబడ్డట్లు తెలిపారు. వీరి నుంచి కార్డులు, రూ.14,190 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

11 మంది బైండోవర్

సిర్పూర్(టి), న్యూస్‌టుడే: జూద స్థావరంపై దాడులు నిర్వహించి జూదం ఆడుతున్న వారిని రాత్రి పలువురిని పట్టుకున్న విషయం తెలిసిందే. 11 మందిని శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాస్ ఎదుట ఒక్కొక్కరికి రూ.2 లక్షల పూచీకత్తుపై బైండోవర్ చేసినట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు. జూదం ఆడుతూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

దేశీదారు పట్టివేత

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: పట్టణంలోని విజయబస్తీలో శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి దేశీదారును పట్టుకున్నారు. పక్కా సమాచారం మేరకు విజయబస్తీలో సోదాలు నిర్వహించగా రతన్ గుప్తా వద్ద దేశీదారు 90 ఎంఎల్ సీసాలు 580 లభ్యమైనట్టు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. పట్టుకున్న దేశీదారు సీసాల విలువ రూ.20,300 ఉంటుందని, ఈ మేరకు మద్యం సీసాలు, నిందితుడిని పట్టణ ఎస్సై సుధాకర్‌కు అప్పగించి కేసు నమోదు చేసినట్టు తెలిపారు. సోదాల్లో టాస్క్‌ఫోర్స్ పోలీస్ కానిస్టేబుళ్లు మధు, రమేష్ పాల్గొన్నారు.

జాతి గర్వించేలా ఎదగాలి


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

రెబ్బెన, న్యూస్‌టుడే : మండల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ అతియా ఖానం మాట్లాడుతూ విద్యార్థులకు ఇంటర్మీడియట్ దశ కీలకమన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకొని ఉన్నతంగా ఎదగాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

తనిఖీ చేసి.. విద్యా సామర్థ్యాలు పరీక్షించి

వాంకిడి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని శుక్రవారం అదనపు పాలనాధికారి దీపక్ తివారీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం మాట్లాడుతూ నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే వార్షిక పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని సూచించారు. అనంతరం మండలంలోని సవ్వాతి, దాబా గ్రామాల మధ్య వర్షాలకు కొట్టుకుపోయిన వంతెన అప్రోచ్‌ను పరిశీలించారు. మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విద్యాశాఖ అకడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్, ఎంపీఓ ఖాజాఅజీజొద్దీన్, ఎంఈఓ శివచరణ్ కుమార్ పాల్గొన్నారు.


ప్రశ్నలు సంధించి విద్యా సామర్థ్యాలు తెలుసుకుంటున్న అదనపు పాలనాధికారి దీపక్‌తివారీ

దుకాణాలు తొలగించండి

బెజ్జూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని కుమురంభీం విగ్రహం చుట్టూ ఉన్న కూరగాయల దుకాణాలను తొలగించాలని ఆదివాసీ సంఘం నాయకులు శుక్రవారం తహసీల్దార్ భూమేశ్వర్, ఎంపీడీఓ రమేష్, ఎస్సై విక్రమ్, కార్యదర్శి తుకారాంలకు వినతిపత్రం అందించారు. దుకాణాలు ఉండటంతో విగ్రహం కనిపించడం లేదన్నారు. కోరేత తిరుపతి, సకారాం, శంకర్, సర్‌మేడి కొడప శంకర్ ఉన్నారు.

సమతుల ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే : చిన్నారులు, కిశోరబాలికలు, గర్భిణులు సమతుల ఆహారం తీసుకోవడంతో ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీవో రెబిక తెలిపారు. పట్టణంలోని జైభీంకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. తక్కువ బరువు ఉన్న పిల్లల వివరాలను నమోదు చేయాలని, ఎదుగుదలకు తీసుకోవాల్సిన, ఇంట్లో తయారు చేసుకునే పోషకాహారంపై అవగాహన కల్పించాలని చెప్పారు. మహాలక్ష్మి, పుష్పలత, భాగ్యలక్ష్మి, రమాదేవి, లావణ్య పాల్గొన్నారు.

జోడేఘాట్‌కు బస్సు పునఃప్రారంభం

కెరమెరి, న్యూస్‌టుడే : జోడేఘాట్‌కు శుక్రవారం ఆసిఫాబాద్ నుంచి బస్సు సౌకర్యాన్ని పునఃప్రారంభించారు. ఆదివాసీ నాయకుల విన్నపం మేరకు ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యం కల్పించడంతో భీం మనవడు సోనేరావు, భీం వర్ధంతి ఉత్సవ కమిటీ ఛైర్మన్ పెందుర్ రాజేశ్వర్ హర్షం వ్యక్తం చేశారు. డిపో మేనేజర్ విశ్వనాథ్ మాట్లాడుతూ గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాయకులు కనక ప్రభాకర్, దంబిరావు, మడావి రాజు తదితరులు పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

కెరమెరి, న్యూస్‌టుడే : సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని తహసీల్దార్ దత్తు ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన సమావేశం నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయులను శాలువతో సన్మానించి, ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేశారు.

కనిపించని ఆహ్లాదం.. సమస్యలు అనేకం


నిర్వహణ లేక వన్నె కోల్పోయిన వెదురు షెడ్డు

న్యూస్‌టుడే, ఆసిఫాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ఏకైక పిల్లల ఉద్యానవనం నిర్వహణ లోపంతో కొట్టుమిట్టాడుతోంది. ఉదయం నడక, యోగ, జిమ్, ఆహ్లాదం కోసం వచ్చే పట్టణవాసులు వసతులను మెరుగుపరచాలని ఉన్నతాధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. ఇటీవల పార్కులోని విలువైన వస్తువులను దొంగలెత్తుకుపోయారు. పార్కులో కోతుల బెడద కూడా ఎక్కువైందని సందర్శకులు వాపోతున్నారు. ఆగస్టు 7న జిల్లా పాలనాధికారి వెంకటేశ్ దోత్రె స్వయంగా పార్కును సందర్శించి సందర్శకుల సమస్యలు విన్నారు. అసౌకర్యాలను పరిశీలించి వసతుల కల్పనకు సంబంధిత అధికారులను ఆదేశించారు. అయినా వసతుల కల్పనలో జాప్యం జరగడంపై స్థానికులు నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు.

తాగునీరు లేదు

ఉదయం నడక, యోగ, ఓపెన్ జిమ్ వ్యాయామం కోసం వచ్చే వారు గంటల కొద్దీ ఇక్కడే గడుపుతారు. పార్కులో స్వచ్ఛమైన తాగునీటి సదుపాయం కల్పించాలని, యోగా కోసం ప్రత్యేకంగా షెడ్డు నిర్మిస్తే ఉపయోగకరంగా ఉంటుందని యోగా సాధకులు పాలనాధికారికి విన్నవించారు. వెంటనే ఈ వసతుల కోసం చర్యలు చేపట్టాలని ఆయన అధికారులకు సూచించారు. ఇప్పటి వరకు అలాంటి పనులేవి ప్రారంభం కాలేదు. సందర్శకుల వద్ద రుసుము తీసుకొంటున్నా.. వసతుల కల్పనలో శ్రద్ధ తీసుకోవడం లేదని విమర్శిస్తున్నారు.

ఫౌంటెన్ అలంకారప్రాయం

ఉద్యానవనంలో రాత్రివేళల్లో సందర్శకులను ఆకట్టుకొనేందుకు ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటెన్ సామగ్రిని దొంగలెత్తుకు పోవడంతో ఆరు మాసాలుగా పనిచేయడం లేదు. పాలనాధికారి సందర్శన అనంతరం మరమ్మతులు చేసి ఇటీవల పునరుద్ధరణ చర్యలు చేపట్టినా లైటింగ్ ఏర్పాటు చేయనందున ఆహ్లాదాన్ని పంచలేకపోతోంది. సందర్శకులు సేదతీరే వెదురు షెడ్డు లోపలు శిథిల దశకు చేరుకుంది. పైన లైటింగ్ పనిచేయడం లేదు.


సామగ్రి దొంగలెత్తుకుపోవడంతో నిరుపయోగంగా మారిన ఫౌంటేన్‌ను పరిశీలించిన కలెక్టర్ వెంకటేశ్ దోత్రె, అదనపు కలెక్టర్ దీపక్ తివారి(పాత చిత్రం)

రక్షణ అవసరం

ఇటీవల సందర్శకులపై కోతులు దాడి చేసి గాయపరిచాయి. పార్కు ప్రహరీపై విద్యుత్తు తీగలు ఏర్పాటు చేయడం లేదా ప్రహరీపై గాజు ముక్కల్ని ఏర్పాటు చేయడం, సిబ్బంది పర్యవేక్షణ పెంచడం ద్వారా ఇబ్బందిని తొలగించాలని పేర్కొంటున్నారు. పరిశుభ్రత చర్యలు తీసుకోవాలని కోరారు. ఆటవస్తువులు, జిమ్, ఫౌంటేన్‌లాంటి విలువైన వస్తువులకు రక్షణ కల్పించాలని సూచించారు.

★ ఈ విషయమై పుర కమిషనర్ భుజంగరావును సంప్రదించగా ఉద్యానవనం సమస్యల పరిష్కారంపై చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలి


ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, చిత్రంలో ఎమ్మెల్సీ దండె విఠల్, అదనపు కలెక్టర్ వేణు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : వయో వృద్ధుల పోషణ, సంరక్షణ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే పేర్కొన్నారు. అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఏర్పాటు చేసిన వాకథాన్ ర్యాలీని అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఎమ్మెల్సీ దండె విఠల్, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి ప్రారంభించారు. వయోవృద్ధుల సంక్షేమాన్ని ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, సీడీపీవోలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో ముగ్గురు విద్యాశాఖ ఉద్యోగులు

బల్లార్ష, న్యూస్‌టుడే: టైపింగ్ ఇనిస్టిట్యూట్ అనుమతి కోసం రూ.50 వేలు లంచం తీసుకుంటుండగా విద్యాశాఖకు చెందిన క్లర్క్‌తోపాటు ఇద్దరు విద్యాశాఖ అధికారులను ఏసీబీ అధికారులు చంద్రపూర్ విద్యాశాఖాధికారి కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం వలపన్ని పట్టుకున్నారు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం చంద్రపూర్ పట్టణంలో టైపింగ్ ఇనిస్టిట్యూట్ ప్రారంభించేందుకు అనుమతి ఇవ్వాలని చంద్రపూర్ జిల్లా విద్యాశాఖాధికారి(మాధ్యమిక)కి అర్జీ పెట్టుకున్నాడు. అక్కడ పని చేసే విద్యాశాఖ విస్తరణ అధికారులు శ్రావణ్ చాల్‌కురే, లఖుత్తమ్ రాథోడ్‌లు ఫిర్యాదుదారుని ఇనిస్టిట్యూట్ అనుమతి కోసం రూ.70 వేలు ఇవ్వాలని అప్పుడే ఫైలు అనుమతి కోసం పంపిస్తామని తెలిపారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని ఫిర్యాదుదారుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. రూ.50 వేలకు ఒప్పందం కుదుర్చుకొని ఆ నగదును విద్యాశాఖలోని ఓ విశ్రాంత క్లర్క్ మహేశ్వర్ పూల్‌జలేకు అందజేయాలని సూచించారు. ఫిర్యాదుదారుడు లంచం ఇస్తుండగా మహేశ్వర్‌ను అదుపులోకి తీసుకున్న అనంతరం ఇద్దరు విస్తరణ అధికారులు శ్రావణ్, లఖుత్తమ్‌లను అరెస్టు చేసినట్లు అవినీతి నిరోధకశాఖ అధికారిణి మంజూష బోంస్లే తెలిపారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివి


ఆసిఫాబాద్‌లో.. ఎస్పీ శ్రీనివాస్‌రావు


కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న పద్మశాలి సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు


కాగజ్‌నగర్‌లో.. విశ్రాంత ఉద్యోగులు


కాగజ్‌నగర్‌లో..

తెలంగాణ రాష్ట్ర సాధనకు కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. బాపూజీ జయంతి సందర్భంగా పలువురు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తొలి దశ ఉద్యమంలో రాష్ట్ర సాధనకు తన మంత్రి పదవిని, తన సొంత ఇంటిని త్యాగం చేసిన ఉద్యమ యోధుడని కొనియాడారు. నిజాం నిరంకుశ పాలనకు, రజాకార్ల దాష్టికాలకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేశారని చెప్పారు. ఆయన జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషకరమన్నారు. **- న్యూస్‌టుడే, బృందం**

బడుల్లో మౌలిక వసతులు కల్పించాలి

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : జిల్లాలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని పీఆర్టీయూ టీఎస్ జిల్లా నాయకులు పాలనాధికారి వెంకటేశ్ దోత్రెకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల ఎన్నికైన సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో పాలనాధికారి, అదనపు పాలనాధికారిని సత్కరించారు. జిల్లాలోని కస్తూర్బాల్లో, తెలంగాణ ఆదర్శ పాఠశాలల్లో బోధన సిబ్బంది నియామకం, పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు, మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అనురాధ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని వినతి

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : డివిజన్ పరిధిలో విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్, ఎస్‌ఎఫ్ఐ నాయకులు సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లను కోరారు. శుక్రవారం సబ్‌కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను విన్నవించారు. డివిజన్‌లోని పాఠశాలల్లో మౌలిక వసతులు, ఉపాధ్యాయుల కొరతను వివరించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వైద్య శాంతికుమారి, ప్రధాన కార్యదర్శి మహిపాల్, మండల ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, బాజీఖాన్, పాల్గొన్నారు.


సబ్‌కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న యూటీఎఫ్, ఎస్‌ఎఫ్ఐ నాయకులు

ఎస్పీఎం కాలుష్యం నియంత్రించాలని..

కాగజ్‌నగర్: సిర్పూర్ పేపర్ మిల్లు విడుదల చేసే కాలుష్యాన్ని నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని పట్టణంలోని సంఘం బస్తీవాసులు శుక్రవారం సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లకు వినతిపత్రం అందజేశారు. ఎస్పీఎం నుంచి వచ్చే పొగ, దుమ్ము, ధూళితో కళ్లలో మంటలు, ఛాతినొప్పి, ఊపిరితిత్తుల వ్యాధులు సోకుతున్నాయని పేర్కొన్నారు. మిల్లు నుంచి విషవాయువులు వెలువడుతున్నాయని, రసాయన నీరు మురుగు కాలువల్లో వదలడంతో పట్టణ ప్రజలు రోగాలబారిన పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. కాలనీవాసులు ఎండీ ఖయ్యూం, జాకీర్‌సాబ్రి, సమీర్, ముజస్సిం, ప్రశాంత్, రాజశేఖర్, ఇర్ఫాన్‌మోయిన్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య నిపుణులను నియమించాలి


వైద్యారోగ్యశాఖ కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రితోపాటు వైద్య కళాశాలలో వైద్య నిపుణులు, బోధకులను నియమించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి శుక్రవారం హైదరాబాద్‌లో వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ ప్రభుత్వ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తూను కలిసి వినతిపత్రం అందించినట్లు చెప్పారు. ఆసుపత్రికి రెగ్యుల్ పర్యవేక్షణాధికారి లేక నిర్వహణ ఇబ్బందిగా మారిందన్నారు. వైద్య నిపుణులు లేక ప్రాథమిక వైద్య సేవలకే పరిమితం అవుతోందని పేర్కొన్నారు. వివిధ విభాగాలకు వైద్య నిపుణులను భర్తీ చేయాలని, పూర్తి స్థాయిలో మందులు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. పారిశుద్ధ్య, పేషంట్‌కేర్ కార్మికుల వేతనాలు, డైట్ ఛార్జీలు ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని వాటిని విడుదల చేయాలన్నారు. వైద్య కళాశాలలో 114 మందికి ఇద్దరు ప్రొఫెసర్లు, ఒక అసోసియేట్ ప్రొఫెసర్, నలుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు మాత్రమే ఉన్నట్లు చెప్పారు. 92 మంది సీనియర్ రెసిడెంట్ వైద్య పోస్టులు మంజూరుకాగా ఏడుగురు మాత్రమే పని చేస్తున్నట్లు తెలిపారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన కాంగ్రెస్ నాయకులు


టీపీసీసీ అధ్యక్షుడికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రావి శ్రీనివాస్

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : నూతనంగా బాధ్యతలు చేపట్టిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను శుక్రవారం హైదరాబాదులో సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి రావి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. గాంధీభవన్‌లో పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. నియోజకవర్గ పరిస్థితులపై వివరించారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ సిద్దాల దేవయ్య, నాయకులు రాంనాయక్ తదితరులు ఉన్నారు.


గోలేటిలోని జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కోల్‌ట్రాన్స్‌పోర్టు కార్మికులు

కార్మికులకు లాభాల వాటా ఇవ్వాలి

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే: సింగరేణి సంస్థలో పని చేస్తున్న కోల్ ట్రాన్స్‌పోర్టు(బొగ్గు రవాణా) కార్మికులైన డ్రైవర్లకు, క్లీనర్లకు లాభాల వాటా రూ.5 వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి ఏరియా రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గోలేటిలోని జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని బెల్లంపల్లి ఏరియా ఎస్ఓటు జీఎం రాజమల్లుకు అందజేశారు.

చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయండి

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే: నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ డివిజన్ అధ్యక్షుడు పోశం, ప్రధాన కార్యదర్శి తిరుపతి కోరారు. ధర్నాకు సంబంధించిన గోడప్రతులను శుక్రవారం గోలేటిలో ఆవిష్కరించారు. కాంట్రాక్టు కార్మికులు శ్రీను, భీమేష్, గోపాల్, కుమార్, సంతోష్, చంద్రయ్య, సావిత్రి, దేవక్క పాల్గొన్నారు.

మంచినీటి సహాయకులకు శిక్షణ

దహెగాం, న్యూస్‌టుడే : మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ మంచి నీటి సహాయకులకు శుక్రవారం శిక్షణ తరగతులను ప్రారంభించినట్లు ఎంపీడీవో రాజేందర్ తెలిపారు. ఈ సందర్భంగా శిక్షకుడు నాగరాజు ఆధ్వర్యంలో మొదటి రోజున చేతిపంపుల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణ నాలుగు రోజులపాటు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఆర్‌డబ్ల్యూయస్ ఏఈఈ ఇనోష్, గ్రామ మంచినీటి సహాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

■ గిన్నెధరిలో కళాజాత బృందం ప్రదర్శన

తిర్యాణి, న్యూస్‌టుడే: మండలంలోని గిన్నెధరి గ్రామంలో శుక్రవారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో కళాజాత బృందంతో బ్యాంకు సేవలను పాటల ద్వారా ప్రజలకు వివరించారు. సురక్ష బీమా, జీవన జ్యోతి బీమా, అటల్ పెన్షన్, మొబైల్ బ్యాంకింగ్, ఖరీఫ్ రుణాలు, గోల్డ్‌లోన్స్, సైబర్ మోసాలపై వివరించారు. బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, ఫీల్డ్ ఆఫీసర్ రాజేందర్, ఐకేపీ సీసీ సంతోష్ పాల్గొన్నారు.

■ ప్రతిరోజు బడికి పంపించాలి

బెజ్జూరు: విద్యార్థులను ప్రతిరోజు బడికి పంపించాలని ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. శుక్రవారం మండలంలోని సలుగుపల్లి ఆశ్రమోన్నత పాఠశాలలో పోషకుల సమావేశం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను అందిపుచ్చుకుని చదువుకోవాలని సూచించారు.

■ వేతనాలు చెల్లించాలి

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల వసతిగృహంలో పని చేస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ కోరారు. శుక్రవారం కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతిపత్రం అందించారు. అయిదు నెలలుగా కార్మికులకు వేతనాలు లేక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు చెప్పారు.

■ ఓపెన్ డిగ్రీలో ప్రవేశానికి 30 వరకు గడువు

కాగజ్‌నగర్: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ కాగజ్‌నగర్ అధ్యయన కేంద్రంలో 2024-25 విద్యా సంవత్సరంలో డిగ్రీలో ప్రవేశానికి ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవాలని అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ తెలిపారు. ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు సైతం ఈ నెల 30లోపు ట్యూషన్ ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. గత సంవత్సరం అడ్మిషన్ తీసుకున్న విద్యార్థులు సెమిస్టర్ 2 పరీక్ష ఫీజును అపరాధ రుసుంతో అక్టోబరు 2 వరకు చెల్లించేందుకు గడువు పెంచినట్టు చెప్పారు.

■ ఆశ్రమ పాఠశాలల జోనల్ క్రీడా పోటీలు

ఆసిఫాబాద్ అర్బన్: గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలల జోనల్ క్రీడా పోటీలను అక్టోబరు 1న నిర్వహించనున్నట్లు గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.రమాదేవి శుక్రవారం తెలిపారు. మంచిర్యాల, ఆసిఫాబాద్ డివిజన్‌లలో ఎంపికైన క్రీడాకారులంతా ఈ నెల 30న సాయంత్రం వరకు ఆసిఫాబాద్ గిరిజన క్రీడల అధికారి బండ మీనారెడ్డికి రిపోర్టు చేయాలని సూచించారు.

■ 30న జిల్లా స్థాయి సైన్సు డ్రామా..

ఆసిఫాబాద్ అర్బన్: ఈ నెల 30న జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల విద్యార్థులకు జిల్లా స్థాయి సైన్సు డ్రామా ఫెస్టివల్‌ను నిర్వహించనున్నట్లు జిల్లా సైన్సు అధికారి కటుకం మధుకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల వివరాలను ప్రధానోపాధ్యాయులు సంబంధిత గూగుల్ ఫాం ద్వారా ఈ నెల 29 వరకు నమోదు చేసుకోవాలని సూచించారు.

■ అధికారులకు సమస్యల ఏకరవు

పెంచికల్‌పేట్: మండలంలోని కమ్మర్గాం గ్రామాన్ని శుక్రవారం ఎంపీడీవో అబ్బర్ట్, ఏఈ బద్రుద్దీన్ సందర్శించారు. కమ్మర్గాం అంగన్‌వాడీ కేంద్రం శిథిలావస్థలో ఉందని అధికారుల దృష్టికి గ్రామస్థులు తీసుకొచ్చారు. అధికారులు అంగన్‌వాడీ కేంద్రం కొలతలు తీసుకున్నారు. మంచినీటి బావి, అంతర్గత సీసీరోడ్లు, పింఛను, సెల్ టవర్ తదితర సమస్యలను తెలుసుకున్నారు. మొర్లిగూడ నుంచి పెంచికల్‌పేట్, నందిగాం నుంచి బెజ్జూరు వరకు రోడ్లు గుంతలమయంగా ఉన్నాయని గ్రామస్థులు అధికారులకు విన్నవించారు. అంతకు ముందు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి మరమ్మతులకు కొలతలను తీసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

■ విద్యుత్తు కనెక్షన్లు ఇప్పించరూ..

పెంచికల్‌పేట్: మండలంలోని మొర్గిగూడ, కమ్మర్గాం గ్రామస్థులతో ఆర్డీవో దత్తారాం ఎల్కపల్లి రైతు వేదికలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్తు కనెక్షన్లు, మోటారు బోర్లు, పింఛన్లు ఇప్పించాలని కోరారు. ఆయన మాట్లాడుతూ వీటికి సంబంధించిన వివరాలను సేకరించి పంపించాలని ఏపీవో సతీష్‌ను ఆదేశించారు. తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

■ ఆయిల్‌ఫాం తోటలతో అధిక లాభాలు

దహెగాం: రైతులు ఆయిల్‌ఫాం తోటలను పెంచుకుంటే అధిక లాభాలు పొందవచ్చని ఉద్యానశాఖ అధికారి సుప్రజ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయిల్‌ఫాం మొక్కలను 90 శాతం రాయితీపై ఈ శాఖ అందిస్తుందన్నారు.

■ నజ్రూల్‌నగర్‌లో వైద్య శిబిరం

కాగజ్‌నగర్ గ్రామీణం: మండలంలోని నజ్రూల్‌నగర్ పంచాయతీలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా పంచాయతీలోని ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులకు ఏఎన్‌ఎం మంగ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఎంపీడీఓ రమేష్, కార్యదర్శి ఛాయ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు బికాస్‌ఘరామీ, కారోబార్ ఛైన్‌రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

■ మెరుగైన వేతనాలతో కార్మికుల జీవితాల్లో వెలుగులు

కాగజ్‌నగర్: తనకు అవకాశం ఇస్తే సిర్పూర్ పేపర్ మిల్లు కార్మికులకు మెరుగైన వేతనాలను సాధించి కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపేలా పనిచేస్తానని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లిఖార్జున్ తెలిపారు. పట్టణంలోని రన్‌గ్రాండ్ లాడ్జ్‌లో సీఐటీయూ అనుబంధ ఎస్పీఎం మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్మికుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఇప్పటి వరకు మిల్లులో గెలిచిన నాయకులు తమ సొంత ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చారని చెప్పారు. మోసపూరిత వాగ్దానాలను నమ్మి మోసపోవద్దని పేర్కొన్నారు.

■ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

రెబ్బెన: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఇన్‌ఛార్జి జీఎం నరేందర్ అన్నారు. స్వచ్ఛతా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గోలేటి శ్రీసత్యసాయిబాబా ఆలయ ఆవరణలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు.

కౌటాల: ప్రతీ ఒక్కరు పరిసరాల పరిశుభ్రతను బాధ్యతగా నిర్వహించాలని డీఆర్‌డీఓ దత్తారావు అన్నారు. శుక్రవారం కౌటాల మండల కేంద్రంలో స్వచ్ఛతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో రెబ్బెన బాలికల ప్రతిభ

రెబ్బెన, న్యూస్‌టుడే: మండలం కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలిక విద్యాలయ విద్యార్థులు జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. కౌటాల మండలంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొని ద్వితీయ బహుమతి సాధించారు. వీరిని శుక్రవారం ప్రిన్సిపల్ రమాదేవి, వైస్ ప్రిన్సిపల్ రజిత, జోనల్ అధికారి అరుణకుమారి, పీటీ స్వరూప, పీడీ రజిత అభినందించారు.


బహుమతి సాధించిన క్రీడాకారులతో అధ్యాపక బృందం